
# మహానగరం కథలు

-వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కధా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# ఒకే నాణెం – రెండు పార్శ్వాలు

"మీ ఇద్దరినీ కలిపి ఒకేసారి పిలిచినందుకు ముందుగా మీరిద్దరూ నన్ను మన్నించాలి, దానికో కారణం ఉంది, పూర్తిగా విని మీకిద్దరికీ ఇష్టమైతే సరే! లేకపోతే ఒక కొత్త ఫ్రెండ్ ని కలిసాను అనుకొని వదిలేయండి. " అంటూ తన ఎదురుగా కుర్చీల్లో కూర్చున్న ఆ ఇద్దరినీ వైపూ చూసింది జాహ్నవి. వారిద్దరి ముఖాల్లోనూ దాదాపు ఒకే భావం, సందేహం.

" భయపడకండి, మీ వివరాలన్నీ నా దగ్గరే భద్రం గా ఉన్నాయి, ఉంటాయి కూడా" అంటూ నవ్వింది.

"మీరేం చెప్తున్నారో నాకు అర్ధం కావడం లేదు" అంది దీప్తి.

ఆమె పేరున్న లాయర్. కొన్నేళ్ళు సీనియర్ల దగ్గరే పని చేసి, గత ఐదేళ్ళ గా స్వంతంగా ప్రాక్టీస్ చేస్తోంది.ఢిల్లీ హైకోర్టులో క్రిమినల్ లాయర్ గా పనిచేస్తున్న ఆమెకి దేశమంతా గర్వించేంత ఎత్తుకు ఎదగాలనీ, ప్రత్యేకించి లిటిగేషన్ ఎక్స్ పర్ట్ గా పేరు తెచ్చుకోవాలని కోరిక. చాలా చురుకైనది, తెలివైనది, తన ఉద్యోగం అన్నా, దానికి సంబంధించిన ఏ విషయమైనా ఎంతో ప్రాణం తనకి.

"నిజమే, మీరన్నది నాకూ అర్ధం కాలేదు, కొద్దిగా వివరంగా చెప్తారా?" అంది దీప్తి పక్కనే కూర్చున్న ప్రీతి. ఆమె ముఖంలో స్పష్టంగా కనిపిస్తున్న సంశయం.

ప్రీతి ఒక గృహిణి, భర్త ఒక ప్రైవేట్ బాంక్ లో పెద్ద ఉద్యోగి, ఇద్దరు మగ పిల్లలు. దాదాపు పదేళ్ళు కెనడాలోని టొరోంటో నగరంలో ఉండి నాలుగేళ్ళ క్రితం ఇండియా వచ్చేశారు. ప్రీతి కెనడాలో ఉండగా ఒక లా ఫర్మ్ లో పనిచేసింది ఒక ఆరునెలలపాటు, అదీ కేవలం భర్త బలవంతం వల్ల , తర్వాత మానేసింది.

"చెప్తాను, ముందు మీరిద్దరూ నా దగ్గరకొచ్చిన కారణం గుర్తు చేసుకోండి, " ఇద్దరినీ ఒకరినొకరికి పరిచయం చేస్తూ అంది జాహ్నవి. ఆమె ఒక కౌన్సిలర్, కుటుంబ వ్యవహారాలు, ముఖ్యంగా స్త్రీల సమస్యలు, వివాహానికి సంబంధించిన విషయాల మీద పని చేస్తుంది. తన దగ్గరకొచ్చేవారి సమస్యలను సానుకూలంగా విని, వినూత్నంగానూ, ఉపయోగకరంగానూ ఉండే పరిష్కారాలు చెప్పడం ఆమె ప్రత్యేకత. ఆమె భర్త కరణ్ పిల్లలకి సంబంధించిన విషయాలు చూస్తాడు. ఇద్దరూ కలిపి తమ స్వంత ప్రాక్టీస్ చేసుకుంటూ సిటీలో పేరున్న కౌన్సిలర్స్ ల జాబితాలో చోటు సంపాదించుకున్నారు.

జాహ్నవి మాటలు విని ఇద్దరూ ఆలోచనల్లోకి మళ్ళారు.

**దీప్తి:**

" ఈ మధ్య ఎందుకో చాలా చిరాగ్గా, అలసటగా ఉంటోంది, ఇంట్లో సంగతి నీకు తెలుసు కదా, అనంత్ విషయంలో ఏమీ మార్పు లేదు." అంది "అలా ఉన్నావేం దీప్తీ?" అన్న అఖిల అడిగినదానికి బదులుగా.

అంతే గానీ రాత్రి జరిగిన విషయాన్ని గురించి ఏమీ చెప్పలేదు. దీప్తి సంగతి బాగా తెలిసిన అఖిల ఆ విషయం గురించి అడగకుండా,

"నువ్వు నీకోసం ఒక గంట కేటాయించుని ఎన్నాళ్ళయింది?ఆ విషయం ఒక్కసారి ఆలోచిస్తే విషయం ఇంత దూరం వచ్చేదా? నిజం చెప్పు. "

తోటి లాయర్ అఖిల అడిగిన ప్రశ్నకి దీప్తి దగ్గర సమాధానం లేదు. అందమైన ఆమె పెద్ద కళ్ళల్లో గిర్రున తిరిగాయి నీళ్ళు . కానీ బయటపడలేదు ఆమె. " అఖిల చెప్తున్నది నిజమే? ఏదీ తనకంటూ ఉన్న సమయం? అసలుందా?

అసలదో పెద్ద విషయమని ఆమె ఎప్పుడూ అనుకోలేదు. ఎంత కష్టమైన పనైనా సరే అలుపన్నది లేకుండా సాధించడమే ఆమెకి తెలుసు. దానివల్లే ఎప్పుడూ పరుగులు పెట్టడమే అలవాటయిపోయింది దీప్తికి.

చిన్నపుటినించీ క్లాస్ లో ఎప్పుడూ ఫస్ట్ రావాలి అన్నది వాళ్ళ ఇంట్లో పైకి చెప్పని నియమం. దానికోసం అహోరాత్రాలు కష్టపడేది, ఒక్క మార్కు తక్కువ వచ్చినా ఆమెకి ఎంతో అవమానంగానూ, చిన్నతంగానూ అనిపించి మరింత శ్రమ పడేది. ఒక్క చదువే కాదు, సంగీతం, చిత్రలేఖనం, ఆటలు అన్నింట్లోనూ ఎప్పుడూ ముందే. ఏ విషయంలోనూ ఓటమిని గానీ, ఆ మాటకొస్తే రెండో స్థానాన్ని కూడా ఒప్పుకోలేని మనస్థత్వం ఆమెది.

తనే కాక, తనకి దగ్గరవాళ్ళందరూ కూడా అలాగే ఉండాలనుకునేది, అటువంటివారితోనే మాట్లాడేది. ఆమె అర్హతలూ, ఆధిక్యతనూ చూసి భయపడో, ఒప్పుకోలేకో కొంతమంది స్నేహితులు దూరమైతే, 'ఆమె అంచనాలకి తగ్గట్టుగా తామెందుకుండాలి?' అన్న భావనతో కొందరు పట్టించుకునే వారు కాదు, అలా ఎవరో ఒకరిద్దరు తరచుగా మాట్లాడేవాళ్ళు తప్ప పెద్దగా స్నేహితులుండేవారు కాదు. అదెప్పుడూ పెద్ద విషయం గా ఆమె అనుకోలేదు. తనూ, తన చదువూ, తన అభిరుచులే లోకంగా మెలిగేది. అందం, చదువూ, అన్నింట్లో ముందుండటం వల్ల ఆమె స్నేహితులందరి తల్లితండ్రులందరికీ దీప్తి అంటే ఎంతో ఇష్టంగా ఉండేది.

ఇంటర్ పూర్తయిన తర్వాత అందరిలా ఇంజనీరింగ్ లేదా మెడిసిన్ కాకుండా ఐదేళ్ళ లా కోర్స్ చదవాలని అనుకుంది దీప్తి. దేశంలో ప్రముఖ లా కళాశాలల్లో ఒకటైన ' నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీ', బెంగుళూరులో అనేక బంగారు పతకాలతో, ఫస్ట్ రాంక్ లో పాసయ్యింది.

ఐదేళ్ళ లా కోర్స్ మూడో సంవత్సరంలో ఉండగా ఇద్దరికీ కామన్ గా తెలిసిన స్నేహితుల ద్వారా పరిచయం అయ్యాడు అనంత్. ఎం.బీ.ఏ చదివి మార్కెటింగ్ రంగంలో పని చేస్తున్నాడు.. చూడగానే ఎవరినైనా కట్టిపడేసే దీప్తి అందం అతన్ని తొలి చూపులోనే ప్రేమలో పడేస్తే, అతని వాక్చాతుర్యం, తెలివితేటలూ, దీప్తి కూడా అతన్ని ఎంతో ఇష్టపడేలా చేశాయి.

దీప్తి తండ్రి ప్రసాద్ మాత్రం ఎందుకో వారిద్దరికీ సరిపోదేమోనని అభిప్రాయ పడ్డారు. అతిగా కష్టపడుతూ, అన్నింటికీ తనని తానుఎప్పుడూ సవాలు చేసుకుంటూ ముందుకు సాగే తన కూతురికీ, తెలివితేటలున్నా పెద్దగా కష్టపడే స్వభావం లేనట్టున్న ఆ కుర్రాడికీ పెద్దగా సరిపోదని అతను భావించారు.

అదే మాట దీప్తితో అంటే నవ్వేసింది. " ఎవరి మీదా ఎప్పుడూ ఆధారపడేంత బేల కాదు నాన్నా మీ కూతురు, నా పనులూ, సమస్యలూ నేనే సాధించుకోగలను " అందినవ్వుతూ. ఒక పెద్ద కార్పోరేట్ ఫర్మ్ లో లాయర్ గా చేరింది. కానీ అది ఆమెకి సంతృప్తినివ్వలేదు.

అప్పుడే అనంత్ స్నేహితుడి సలహా మేరకి ఢిల్లీ లో ఒక ప్రఖ్యాత క్రిమినల్ లాయర్ దగ్గర జూనియర్ గా చేరింది. దాదాపు మూడేళ్ళ వరకూ అనంత్ కి ఢిల్లీ కి బదిలీ అవలేదు, అందుకని తను ఒక్కర్తే ఏడాదిన్నర వయసున్న పిల్లతో, తల్లితండ్రులతో ఉండేది. అనంత్ ఢిల్లీ వచ్చేసరికి వాళ్ళకిద్దరు పిల్లలు.అప్పటికామె క్రిమినల్ లాయర్ గా నిలదొక్కుకోవడమే కాక, సామాజిక అంశాల మీద వ్యాసాలూ, ఆర్టికల్స్ అవీ రాయడం మొదలు పెట్టింది. అంచెలంచెలుగా ఎదుగుతూ దేశీయ, అంతర్జాతీయ సమావేశాల్లోనూ, కాన్ ఫరెన్సులలోనూ ప్రసంగాలూ, పరిశోధనా పత్రాలూ సమర్పించేది.

ఇప్పటివరకూ భారత దేశంలో కేవలం ఐదుగురు మహిళలకి మాత్రమే దక్కిన అరుదైన ఢిల్లీ హైకోర్టు వారిచ్చే "సీనియర్ అడ్వకేట్" హోదాని పొందడమనేది ఆమె కల. దానికి తగ్గ అర్హతలన్నీ ఆమె ఇటీవలే సాధించింది, పదేళ్ళ పాటు న్యాయశాస్త్రానికి సంబంధించిన వివిధ రంగాల్లో సాధించాల్సిన విజయాలూ, ముఖ్యంగా గత మూడు సంవత్సరాల కాలంలో కనీసం పదిహేను తీర్పు ఉత్తర్వులలో తమ పేరు ఉండడం లాంటి అర్హతలన్నీ సాధించింది.

వృత్తిపరంగా ఎంత ఎదుగుతున్నా కూడా కుటుంబాన్ని ఏనాడూ నిర్లక్ష్యం చెయ్యలేదు ఆమె. అనంత్ నీ, పిల్లలనీ ప్రాణం కన్నా ఎక్కువగా చూసుకునేది. ఉద్యోగరీత్యా అనంత్ కాంపుల్లో తిరుగుతున్నా సరే పిల్లలు నేహా, నిఖిల్ లకి కావలసినవన్నీ దగ్గరుండి సమకూర్చేది. అనంత్ తిరిగి వచ్చేసరికి వీలున్నంతవరకూ తాను దగ్గరుండడమేకాక, అతని అవసరాలు తీర్చడంలో ఎంతో శ్రద్ధ గా ఉండేది. " తమ ఇద్దరిదీ" అయిన ఆ ఇంటికి అతనేమీ చెయ్యడంలేదు అన్న భావన ఎప్పుడూ మనసులోకి కూడా వచ్చేది కాదామెకి. దానికి కారణం అతనిమీదున్న ప్రేమే.

కానీ అనంత్ మాత్రం ఆమె ఎదుగుదలని సరిగ్గా తీసుకోలేకపోయాడు. మొదట్లో ఆమె కేసు నెగ్గినా, మంచి పేపర్ సమర్పించినా ఎంతో సంతోషించి అభినందిం చేవాడు. తెలియకుండానే, మెల్లిగా అతనిలో మార్పు రావడం మొదలయింది. ఏదో తెలియని ఆత్మన్యూనతా భావమూ, అసూయా అతని మాటల్లోనూ, చేతల్లోనూ చోటు చేసుకోవడం మొదలు పెట్టాయి. "ఢిల్లీ హైకోర్టు లాయర్ తన భార్య, ఒక కార్పోరేట్ సంస్థలో మార్కెటింగ్ మేనేజర్ తను. ఎంత తేడా? తనలాంటి అనంత్ లు దేశంలో ఎందరో? కానీ దీప్తీ అనంతులు? " ఇదే పరిస్థితిలో ఒక మహిళ ఉంటే తన భర్త గురించి ఎంతో గొప్పగా చెప్పుకుంటుంది. మరి తనకెందుకు అంత అసహనంగా ఉందో అతనికే తెలియదు.

ముభావం నించి మూడీతనం గానూ, అక్కడనించి ముక్కోపం గానూ మారడానికి ఎక్కువకాలం పట్టలేదు. అగ్నికి ఆజ్యం తోడయినట్టు, లాభాలు లేవని, గత మూడేళ్లుగా సేల్స్ టార్గెట్ లు చేరుకోని కారణంగా అతని ఉద్యోగం పోయింది. అనంత్ ఆ విషయాన్ని చాలా అవమానంగా భావించాడు. కొన్నాళ్ళు ఇల్లు వదిలి బయటకి రాలేదు, ఉద్యోగం లో ఉండగా' సరదాగా అంటూ' మొదలయిన ఆల్కహాల్ అతనికి రోజువారీ అలవాటయింది. సిగరెట్లు సరేసరి. రాత్రి పొద్దుపోయేవరకూ తాగుతూ, టీ.వీ చూస్తూనో, పుస్తకాలు చదువుతూనో గడపడమూ, పొద్దుపోయాకా నిద్ర లేవడమూ లాంటి వాటి వల్ల దినచర్య ఒక క్రమం అంటూ లేకుండా తయరయ్యింది.

తనకి తెలిసిన వారి ద్వారా ఏదైనా ఉద్యోగం ఇప్పించే ప్రయత్నం చేసినప్పుడల్లా దీప్తి మీద విరుచుకు పడే వాడు.

" ఇంక చస్తే ఒకడి కింద పని చెయ్యను, ఇరవై ఏళ్ళు ధారపోశాను పాత కంపెనీకి, ఇరవై నిమిషాలు ఆలోచించలేదు వాడు. కూరలో కరివేపాకు తీసేసినట్టు ఏరి పారేశారు, వెధవ కార్పోరేట్లు, పాలిటిక్సూ"అని విసుక్కునేవాడు. దానితో ఆ ప్రయత్నం మానుకుంది. కొన్నాళ్ళు ఏమీ మాట్లాడకపోతే " నా గురించి నీకేం పడుతుంది? పెద్ద క్రిమినల్ లాయర్ అన్న పేరు ఉందిగా" అని ఎత్తిపొడిచేవాడు. ఎలా స్పందించాలో అర్థం అయ్యేది కాదు దీప్తికి.

ఎంతో సంతోషంగా, హాయిగా సాగుతుందనుకున్న వారి సంసారం అయితే వాదోపవాదాలతోనూ, లేకపోతే అలకలూ, అపార్థాలతోనూ గడవడం మొదలయింది. ఇలా రెండేళ్ళు గడిచినా అనంత్ లో మార్పు లేదు.

ఇంటిపనీ, ఆఫీస్ పని దీప్తిని విపరీతమైన శారీరిక వత్తిడికి గురిచేస్తే, ఏ మాత్రం సఖ్యతలేని అనంత్ సాహచర్యమూ, అతని ప్రవర్తనా ఆమెపై మానసిక ఒత్తిడిని పెంచాయి.

"అసలు తీరిక లేకుండా పని కల్పించుకోవడమే దీనికి పరిష్కారం" అనుకున్న దీప్తి మరింత బిజీగా ఉండసాగింది.

"కలిసి ఆనందంగా ఉండలేనప్పుడు కనీసం ఆ జ్ఞాపకాలతో విడిపోవడమే మంచిది " అని దీప్తి అభిప్రాయ పడింది. కానీ అనంత్ దానికెంతమాత్రమూ ఒప్పుకోలేదు.

ఒక పక్కన వస్తున్న పేరు ప్రఖ్యాతులూ, తద్వారా వస్తున్న డబ్బూ, కూడబెడుతున్న ఆస్థిపాస్థులూ , వృత్తిపరంగా విజయాలని అందిస్తుంటే, వ్యక్తిగతమైన ఓటమిని మాత్రం ఆమె తట్టుకోలేకపోయింది .

ఆమె ఆశించినట్టే ఢిల్లీ హైకోర్టు ఆమెకి" సీనియర్ అడ్వకేటు" హోదాతో గౌరవించింది. ఆ సందర్భంగా ఆమె ఇచ్చిన పార్టీలో అనంత్ ఉన్న అరగంటలోనూ,తెలిసిన వారి దగ్గర తనగురించి చాలా అవమానకరంగానూ, తేలిగ్గానూ, మాట్లాడడాన్ని భరించలేకపోయింది.

ఆ రోజు మొదటిసారి తగని నైరాశ్యానికి గురైంది. ఈ మధ్య వత్తిడిని మరిచిపోవడానికి వేసుకుంటున్న నిద్రమాత్రలు తనకి తెలియకుండానే గుప్పిట నిండా తీసుకుని వేసుకుంది. కళ్ళు మూతలు పడుతున్న సమయంలో తాను చేసినది పొరబాటని తెలిసింది.విపరీతంగా అలసిపోయిన శరీరమూ, మనసూ దేనికీ స్పందించే స్థితిలో లేవు. కనీసం కన్నీళ్ళు కూడా రావడం లేదు ఆమెకి.

అంత ధైర్యంగా ఉండే తను ఇలా ఎలా చెయ్యగలిగింది? అతని ప్రవర్తన తన ఓటమి ఎలా అయ్యింది? అంత మాత్రం ఆలోచించలేకపోయిందా? దేవుడా! నాకేం కాకుండా చూడు, అని మాత్రం మొదటిసారి దేవుడినడిగింది, అది కూడా తన పిల్లల కోసం.

అమ్మ అదోలా ఉండడం చూసిన పధ్నాలుగేళ్ళ నీహా, అఖిలా ఆంటీ కి ఫోన్ చేసింది. వెంటనే అఖిల డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళడమూ, సరి అయిన చికిత్స చెయ్యడమూ జరగడం వల్ల ఏ ప్రమాదమూ జరగలేదు.

అప్పుడు అఖిల చెప్పింది జాహ్నవి గురించి. " నాన్ సెన్స్, నాకు కౌన్సిలర్ అవసరమేమిటి? నీకు తెలీదూ, నా సంగతి" అంది నవ్వబోతూ.

" అవును, అందుకే మనం ఇలా మాట్లాడుకోవల్సిన పరిస్థితి వచ్చింది, కదూ" అంది అఖిల.

"మన మీద మనకి విశ్వాశం ఉండడం చాలా మంచిది దీప్తీ, అది చాలా అవసరం కూడా, కానీ అది మనకి తెలియకుండానే సన్నగిల్లుతోందా, అధైర్యాన్నీ, అశక్తతనీ. ఆహ్వానిస్తోందా? అనేది గుర్తించడం కూడా చాలా అవసరం. అతిగా చనువు

తీసుకుంటున్నాను అని నువ్వు అనుకోకపోతే ఒక్క విషయం చెప్తాను. "బంగారు పళ్ళానికైనా గోడ చేర్పు ఉండాలి", ఆ గోడ ఏదో మనకి మనమే వెతుక్కోవాలి " అలా ఆమె అరగంట మాట్లాడాకా అప్పుడు ఒప్పుకుంది దీప్తి జాహ్నవిని కలవడానికి.

**ప్రీతి:**

ప్రీతి పుట్టిందీ, పెరిగిందీ విశాఖపట్నంలో. డిగ్రీ పూర్తవగానే ప్రభాకర్ తో పెద్దలు కుదిర్చిన వివాహం, వెంటనే దుబాయి లో కాపురం పెట్టడం జరిగిపోయాయి. అప్పటిదాకా ఎప్పుడూ విమానం ఎక్కని ప్రీతికి ఒకేసారి విదేశంలో ఉండడం అంటే స్వర్గానికి నిచ్చెన వేసినంత సంబరం వేసింది. మబ్బుల్లో తేలుతూ వెళ్లింది, దుబాయిలో భారతీయులు ఎక్కువగా ఉండే ' బర్ దుబాయి, కరామా ల' మధ్యలో ఇల్లు తీసుకున్నారు. చాలా త్వరగానే నలుగురు స్నేహితులు దొరికారు. ప్రతీవారమూ పార్టీలూ, షార్జా, అల్ ఐన్, ఫ్యుజేరా, అబూ ధాబీ లాంటి మిగతా ఎమిరేట్స్ మాత్రమే కాక, ఈజిప్ట్ లాంటి పొరుగు దేశాలు కూడా తిరుగుతూ ఉండగానే మూడేళ్ళ కాలం గిర్రున తిరిగింది. అప్పుడే స్నేహితులందరూ కెనడా కి ఇమ్మిగ్రేషన్ మీద వెళ్తూ ఉంటే, వాళ్ళు కూడా వారిని అనుసరించి కెనడా వెళ్ళారు.

ప్రీతికి మొదటినించీ పెద్ద చదువుల మీదా, ఉద్యోగం చెయ్యడం మీదా పెద్ద ఆసక్తి లేదు. సరదాగా జీవితాన్ని ఎంజాయ్ చెయ్యాలి అనేదే ఆమె పద్ధతి. అందుకే ప్రభాకర్ ఎప్పుడైనా చెప్పబోతే కూడా విసుక్కునేది.' తనకి ఇష్టం లేని పని ఎందుకు చేయించాలి ?' అని అతనూ ఎక్కువ పట్టుబట్టలేదు. ఒక్క ఆరునెలలు మాత్రం అతని స్నేహితుని భార్య మెటర్నిటీ. లీవ్ తీసుకోవడంవల్ల ఒక లా ఫరంలో ఆవిడ బదులుగా చేసింది.

టొరొంటో లో కూడా చలికాలపు వాతావరణం తెచ్చే ఇబ్బందులు తప్ప అన్ని విధాలుగా ఎంజాయ్ చేసేది ప్రీతి. ఇంటి పనీ, పిల్లల పనీ ఎంతో శ్రద్ధగా చేసేది. పిల్లలని స్కూళ్ళకీ, క్లాస్ లకీ దింపడం, తీసుకు రావడం, వారికిష్టమైనవి చేసి పెట్టడమూ, ఇంటిపనీ, స్నేహితులూ, వీటి మధ్య టైమే ఉండేది కాదు.

"మమ్మా, మాం అంటూ పిల్లలూ, ప్రీతూ, ప్రీతీ అంటూ ప్రభాకరూ " ఎప్పుడూ తన చుట్టూ తిరుగుతూ ఉంటే ఆమెకెంతో ఆనందంగానూ, గర్వం గానూ ఉండేది.

తెలుగు మర్చిపోకూడదని పిల్లలకి పురాణాలూ, ఇతర కథలూ చెప్పడమే కాదు, శ్లోకాలూ, పద్యాలూ దగ్గరుండి నేర్పించేది.

చాలా సంవత్సరాలు స్వదేశాన్ని వదిలి ఉండటం అందరి వల్లా కాదు. ఎంత పెద్దవాళ్ళమైనా అమ్మ వంట కోసం పరితపించినట్టే, మాతృదేశానికి తిరిగి వచ్చేయలన్న తపన చాలామందిలో ఏదో ఒక స్టేజ్ లో కలగడం సహజం.

అలాగే ప్రభాకర్ కూడా ఒక రోజు " మా కంపెనీ వాళ్ళు ఇండియాలో ఆఫీస్ పెడుతున్నారు, అక్కడ పనిచెయ్యడానికి ఇష్టం ఉన్నవారికి అవకాశం ఇస్తారు, నేను ఇక్కడ పనిచేస్తున్న విభాగాన్ని అక్కడ కూడా మొదలు పెట్టమంటున్నారు, నాకైతే వెళ్లిపోదామని ఉంది, నువ్వేమంటావ్?" అని అడిగాడు.

మొదట ఒప్పుకోకపోయినా నాలుగు ప్రస్తావనల తర్వాత కొంచం అయిష్టంగానే ఒప్పుకుంది.

ఢిల్లీలో చాలా అధునాతనంగానూ, చాలా పోష్ గానూ ఉండే గ్రేటర్ కైలాష్ ప్రాంతం ప్రీతికి చాలా నచ్చింది. పిల్లలకి మంచి స్కూల్లో సీట్లు దొరికాయి, వాళ్ళిద్దరూ పొద్దున్నే టిఫిన్ తినేసి, డబ్బాలు పట్టుకుని వెళ్ళిపోతారు. మళ్ళీ సాయంత్రమే రావడం, వచ్చాకా ఒకళ్ళు కీ బోర్డ్ క్లాస్ కి, మరొకరు టెన్నిస్ కీ వెళ్తారు. వాళ్ళు తిరిగి వచ్చేసరికి ఏడు దాటుతుంది. అప్పటికి ప్రభాకర్ కూడా వస్తాడు. అందరూ కలిసి భోజనం చేసి పడుకునేసరికి పదకొండు, మర్నాడు మళ్ళీ మామూలే. కెనడా తో పోలిస్తే పిల్లలతో గడిపే సమయం చాలా తగ్గిపోయింది ప్రీతికి.

వాళ్ళు కాలేజీల కి వచ్చేసరికి, హాస్టళ్ళల్లో ఉండడం వల్ల ఆమెకి వాళ్ళు కనిపించడమే తగ్గిపోయింది. ప్రభాకర్ కూడా మొదటి నాలుగైదేళ్ళు తన కొత్త డివిజన్ పనుల్లోనూ, తర్వాత కొత్త ప్రోజెక్ట్ లతోనూ విపరీతమైన బిజీ గా ఉండేవాడు. దానితో ప్రీతికి మరింత కష్టంగా ఉండేది.

మరే ఇతర వ్యాపకాలూ, హాబీలు లేని ఆమె కేవలం ఇంటిని అందంగా సర్దుకోవడం, స్నేహితులతో ఫోన్ ల లో మాట్లాడడమూ లాంటి పనులు మాత్రమే చేసేది. పనివాళ్ళు ఎంత చేసినా సరే ఎప్పుడూ ఒక తడిబట్టో, పొడి బట్టో తీసుకుని దులిపినవే మళ్ళీ దులపడమూ, వాడి పారేసిన టూత్ బ్రష్ తీసుకుని బాత్ రూం టైల్సూ, కిటికీలూ, తలుపుల మధ్యనున్న సందులూ తోమడమూ, ఇలా సాగేది ఆమె దినచర్య.

ఎంత పని చేసినా సమయం తరిగేది కాదు, దానితో ఆమెకి చిరాకు పెరిగింది, ముఖ్యంగా తనెవరికీ అఖ్ఖరలేదన్న భావన ఆమెని పీడించడం మొదలు పెట్టింది.

కెనడాలో ఉండగా ఎంత బిజీగా ఉన్నా సరే " నువ్వొక్కదానివే ఎన్ని పనులు చేస్తావు? "అంటూ గిన్నెలు కడగడంలోనూ, వాక్యూం చెయ్యడంలోనూ సహాయం చేసే భర్త ఇప్పుడేమో, "ఊరికే ఎందుకు హైరానా పడతావు? కావాలంటే ఇంకో మనిషిని పెట్టుకో" అంటే ఆమెకి నచ్చడం లేదు.

" మాం, టెల్ అస్ హనూమాన్ స్టోరీ "అని మెడ చుట్టూ చేతులు వేసి గారం గా అడిగే పిల్లలు ఇప్పుడు సెలవులకి తప్ప ఇంట్లో కనిపించకపోవడం వల్ల ఆమెలో ఒంటరితనం ఎక్కువయ్యింది. ఎంతో సరదాగా ఉండే ఆమె స్తబ్దుగా తయారయ్యింది. ఏదో తెలియని బాధ ఆమెలో, ప్రభాకర్ మొదట్లో గమనించలేదు, నీరసంగానూ, నిస్తేజంగానూ కనిపిస్తున్న భార్యని గమనించి కంగారు పడి ఆమె వద్దన్నా సరే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్ళాడు. రకరకాల పరీక్షలు అయ్యాకా ఆయన చెప్పిన సమాధానం జాహ్నవి.

నిజానికి ప్రీతి సమస్య కొత్తదేమీ కాదు, ఎంతో ప్రేమానురాగాలతో అల్లుకున్న తమ చిన్న గూటిలో, ఇన్నాళ్ళూ తమ రెక్కల కింద పొదువుకుని సాకిన పిల్లలు రెక్కలొచ్చి ఎగిరిపోయినప్పుడు నడి వయసులో చాలా మందికి కలిగేదే "ఎంప్టీ నెస్ట్ సిండ్రోం" అంటారు ఇంగ్లీష్ లో. విస్తరిస్తున్న పరిధులూ, చిన్నదవున్న ప్రపంచమూ ఏదీ పూడ్చలేని దిగులది. ఎవరికి వారు తమంత తాముగా ఎదుర్కొని, తట్టుకోవలసిన సమస్య అది. స్వతహాగా సున్నిత మనస్కురాలూ, తన కుటుంబమే ప్రపంచమనుకునే ప్రీతికి దానిని దాటడం అంత సులభం కాలేదు. అందుకే తినీ, తినకా, తనని తాను పట్టించుకోకా ఇలాంటి పరిస్థితి ఎదురయిందామెకి.

దాదాపు ఒక అరగంటసేపు వారిద్దరినీ అక్కడ వదిలి వెళ్ళిన తర్వాత తిరిగి ఆ గదిలోకి ప్రవేశించింది జాహ్నవి.

" గుర్తుకు తెచ్చుకున్నారా? మీ ఇద్దరూ ఏమైనా మాట్లాడుకున్నారా? " అంది చిన్నగా నవ్వుతూ. " మీరు వెళ్ళాకా ఇంకొకసారి హెల్లో చెప్పుకున్నాము, ఆ తర్వాత ఎవరి ఆలోచనల్లోకి వాళ్ళు వెళ్ళి పోయాము" అంది దీప్తి కూడా నవ్వుతూ.

" అవును" అన్నట్టు చిన్నగా తల ఊపింది ప్రీతి.

" ఇప్పుడు చెప్పండి మీరు మా ఇద్దరికీ కలిపి ఏం చెప్పాలనుకున్నారో? అమి దీప్తి.

" అదే చెప్పబోతున్నా, మీ ఇద్దరికీ ఉన్నది ఒకటే సమస్య "టైం", ఐతే ఎక్కువగా ఉండటం, లేదా అస్సలు లేకపోవడం. అంటే మీరిద్దరూ ఒకే నాణానికి రెండు వైపులా ఉన్నారన్నమాట. దానికి నాకు తోచిన పరిష్కారం "పంచుకోవడం", మీకున్న మిగతా సమస్యలు విడివిడిగా మాట్లాడుకుందాం. మీకిది చాలా సింపుల్ గానూ, సిల్లీగానూ అనిపిస్తే క్షమించాలి. ముందే చెప్పాను కదా, మీకు నచ్చితేనే ప్రయత్నిద్దాం, లేదా మీ ఇష్టం.

"దీప్తి గారు, మీరొక పెద్ద లాయర్, కారణాలేమైనా మీకంటూ సమయం లేదు మీ దగ్గర, మీరు ప్రీతిగారికి ఏదైనా పని కల్పించి తనకి హెల్ప్ చెయ్యగలరా? ఆలోచించండి, ఇన్నేళ్ళల్లోనూ ఆవిడ కేవలం ఆరునెలలు ఒక లా ఫర్మ్ లో పని చేశారు. ఆ విషయం మనసులో ఉంచుకుని మీకు వీలైన పని తనకి చూపగలరా? రోజూ అక్కరలేదు, వారానికి రెండు మూడు రోజులు. దానివల్ల తనకోసం ఒకరు ఎదురుచూస్తారు, పని పూర్తి చెయ్యకపోతే ఇబ్బంది పడతారు అన్న భావనలు కలుగుతాయి, అది పెద్ద మోటివేషన్ అవుతుంది అని నేను ఖచ్చితంగా చెప్పగలను." అని ఒక్క క్షణం ఆగి, ప్రీతి వైపు చూస్తూ..

" ప్రీతి గారు, మీకు కెనడాలో ఉన్న స్నేహితులు ఇప్పుడు ప్రపంచంలో ఎక్కడెక్కడో ఉన్నారు. ఢిల్లీలో మీకు కొత్త స్నేహితులు కలవలేదు, కానీ జాగ్రత్తగా చూస్తే ఇక్కడా స్నేహితులుంటారు, దానికి బిజీగా ఉన్న మీ భర్తే సహాయం చెయ్యక్కరలేదు కదా? దీప్తిగారిని వారానికోసారి ఒక కప్పు కాఫీ కి తీసుకెళ్ళండి, నెలకొకసారి సినిమాకి. ఆవిడకి తనదైన ఆ సమయం చాలా ముఖ్యం, తనంతగా ఆవిడ పక్కకి పెట్టలేరు దాన్ని, ఎవరైనా ప్రయత్నపూర్వకంగా తీసుకెళ్తే తప్ప. చెప్పండి, అది మీరు చెయ్యగలరా? " అంటూ ఇద్దరి ముఖాల్లోకి సూటిగా చూసింది.

మనం పెద్దవి అనుకునే సమస్యలు పెద్దవి కాకపోవచ్చు, కావు అనుకునేవి పెద్దవి కావచ్చు. కానీ సమస్యని గుర్తించడం ముఖ్యం, అలాగే పరిష్కారం కూడా ఎప్పుడూ పెద్ద, పెద్ద నోరు తిరగనీ థెరపీలలోనూ, మందులలోనూ ఉంటుందని కూడా అనుకోలేం. గ్రూప్ థెరపీ అనీ ఒకే సమస్యని ఎదుర్కొటున్న కొందరిని ఒకచోట చేర్చి వారికీ,'కపుల్ థెరపీ' అని భార్యా భర్తలకీ చాలా సాధారణంగా చేస్తూ ఉంటాము, అవి చాలా మంది విషయంలో గొప్పగా పని చేస్తాయి. మీరిద్దరికీ ఇష్టమైతే మీ ఇద్దరిదీ ఒక విభిన్నమైన కపుల్ థెరపీ అవుతుందని ఆశిస్తాను, ముందే చెప్పినట్టు మీ ఇతర వ్యక్తిగత విషయాలు మీ ఇద్దర్తోనూ విడివిడిగా చర్చిద్దాం అంది చిరునవ్వుతో.

వారిద్దరి ముఖాల్లోనూ చిరునవ్వు ఎంతో అందంగా కన బడింది జాహ్నవికి.

●●●

Click here to share your comments on this story